# ఇరాన్ మహిళకు నగరంలో అరుదైన ప్లాస్టిక్ సర్జరీ

పంజగుట్ట, మే 11 ప్రభాతవార్త: బాంబుదాడిలో గాయపడిన ఇరాన్‌దేశానికి చెందిన ఒక మహిళకు నగరంలోని అపోలో ఆసుపత్రి వైద్యుడు అరుదైన ప్లాస్టిక్ సర్జరీ నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ దేబ్‌రాజ్ షోమ్ వివరాలను వెల్లడించారు. సంవత్సరం క్రితం బాంబు బ్లాస్టింగ్‌లో తీవ్రంగా గాయపడ్డ సోఫియా మొహియాబిన్ అనే 30 ఏళ్ల మహిళకు ప్లాస్టిక్ సర్జరీ ద్వారా ఆమె మొఖంపై ఏర్పడిన తీవ్ర గాయాలను సైతం కనిపించకుండా చేయడమేకాకుండా ఈ ఘటనలో కంటిచూపు కోల్పోయిన ఈ మహిళకు తిరిగి కంటి చూపును రప్పించినట్లు వైద్యులు తెలిపారు. అత్యాధునిక వైద్య పరికరాలతో జరిగిన ఈ ప్లాస్టిక్ సర్జరీకి తొమ్మిది గంటల సమయం పట్టిందని వైద్యులు తెలిపారు. ఆరునెలల క్రితం జోర్డాన్ దేశంలో ఈ మహిళకు ప్లాస్టిక్ సర్జరీ జరిగినప్పటికీ పూర్తిస్థాయిలో కోలుకోకపోవడంతో మనదేశానికి వచ్చి ఈ చికిత్స చేయించుకున్నట్లు బాధితురాలు మీడియా ముందు తెలిపింది. కాగా అత్యంత అరుదుగా ఇలాంటి ప్లాస్టిక్ సర్జరీలు విజయవంతం అవుతాయని డా. దేబ్‌రాజ్ మీడియాకు తెలిపారు.